## నేడు విద్యుత్ సరఫరా బంద్

వైరాటౌన్, డిసెంబర్ 1 : వైరా టౌన్ ఫీడర్1లో 11 కెవి లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టౌన్ ఫీడర్1 పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. బంక్ కాలనీ, బోడేపూడి కాలనీ, బ్రాహ్మణపల్లి, మధిర రోడ్డు, రాజశేఖర్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్యనగర్, గాంధిచౌక్, సత్రంబజార్, పాత తండా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నియోజకవర్గంలో 87.43 శాతం పోలింగ్

సత్తుపల్లి, డిసెంబర్ 1 : సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 292 పోలింగ్ బూత్‌ల్లో 87.43 శాతం పోలింగ్ నమోదైంది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 89.05 శాతం పోలింగ్ నమోదుకాగా ఈసారి కొంత మేర పోలింగ్ శాతం తగ్గింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా సాగి 9 గంటలకు 12.8 శాతం, 11 గంటలకు 32.57 శాతం, మధ్యాహ్నం 1 గంటలకు 44.86 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం 3 గంటలకు 63.07 శాతం, సాయంత్రం 5 గంటలకు 79.09శాతం, రాత్రి 7 గంటలకు 87.43శాతం పోలింగ్ నమోదైంది. పట్టణ ప్రాంతం కంటే గ్రామీణ ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ ఓటును నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలో 2,43,118 ఓటర్లకు గాను 2,12,549 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోగా అందులో పురుషులు 1,03,965, మహిళలు1,08,578, ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న యువకుడు

కారేపల్లి, డిసెంబర్ 1 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్సై రామారావు అన్నారు. విశ్వనాథపల్లి పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న చిన్నిపిల్లల కొరకు గ్రామ యువకులు స్వచ్ఛందంగా రక్తం దానం చేయటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో యువత మరిన్ని సమాజసేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన దాతలకు పండ్లు పంపిణీ చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సింధు, చారి,మహేందర్, తాతా మధు, భాస్కర్, పండు, హుస్సేన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి






సత్తుపల్లి : పట్టణంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, వైరాటౌన్ : ర్యాలీని ప్రారంభించి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, నిర్వాహకులు

సత్తుపల్లి, డిసెంబర్ 1 : పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ ఏ కారణాల వల్ల వస్తుంది..ఎయిడ్స్ కలిగించే రుగ్మతలు, అది ఎలా వ్యాప్తిచెందుతుందనే విషయాన్ని విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణకు సంబంధించి నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎం.మాధవి, ఎన్‌సీసీ కేర్ టేకర్, రెడ్‌రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ రవికుమార్, అధ్యాపకులు పానెం రామచందర్‌రావు, చెన్నారావు, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, సీహెచ్.ఆంజనేయులు, శ్రీకాంత్, రాజ్‌కుమార్, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైరాటౌన్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఠాగూర్ విద్యాసంస్థలు, క్రాంతి జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎయిడ్స్ వచ్చిన వారి పట్ల ప్రేమ, సానుభూతితో వ్యవహరించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్‌ఎస్‌ఎస్ పివో లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులు మజీద్, వేణు, శిరీష, చైతన్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి డిసెంబర్ 1 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు బి.సురేశ్, తేళ్ల శ్రేష్టాసాఫల్య ప్రారంభించి మాట్లాడుతూ భావితరాలలో ఎయిడ్స్ వ్యాధితో మరణాలు లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హెచ్ఐవీ రహిత నిర్మాణం కొరకు శ్రమిద్దామని, హెచ్ఐవీ నివారణ, వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మాదారం పల్లెదవాఖానా వైద్యాధికారి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లి : ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి, పాల్గొన్న సిబ్బంది

# బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

- నియోజకవర్గంలో ఉత్కంఠ
- రేపు తేలనున్న ఎన్నికల ఫలితాలు

వైరాటౌన్, డిసెంబర్ 1 : నియోజకవర్గ అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో ఉంది. రేపటితో అభ్యర్థుల గెలుపోటములు ఖరారు కానున్నాయి. ఈ నేపథ్యంలో వైరా నియోజకవర్గంలో ఉత్కంఠ పరిస్థితి నెలకొన్నది. వైరా నియోజకవర్గ వ్యాప్తంగా 80.57 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 252 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా సింగరేణి మండలంలో 45011 మంది ఓటర్లు ఉండగా ఇందులో 17445 మంది పురుషులు, 18422 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా 79.68 శాతం పోలింగ్ నమోదైంది. జూలురుపాడు మండలంలో 27632 మంది ఓటర్లలో11028 మంది పురుషులు, 11629 మంది మహిళలు, ఓటు వేయగా 82.00 శాతం పోలింగ్ నమోదైంది. ఏన్కూరు మండలంలో 27498 మందికి పురుషులు 10754 మంది, మహిళలు 11892 మంది ఓటు వేశారు. 82.36 శాతం పోలింగ్ నమోదైంది. కొణిజర్ల మండలంలో 48826 మంది ఓటర్లు ఉండగా ఇందులో 19261 మంది పురుషులు, 20945 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా, 82.35 శాతం పోలింగ్ నమోదైంది. వైరా మండలంలో 44102 మంది ఓటర్లు ఉండగా 16278 మంది పురుషులు, 17896 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 77.49 శాతం పోలింగ్ నమోదైంది. వైరా నియోజకవర్గ వ్యాప్తంగా 1,93,069 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 74,766 మంది, మహిళలు 80,784 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఫలితాలిస్తున్న పల్లె దవాఖానలు

- గ్రామాల్లోనే పూర్తిస్థాయి ఆరోగ్య సేవలు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న సిబ్బంది

కారేపల్లి, డిసెంబర్ 1 : మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన పల్లె దవాఖానల ఏర్పాటు వల్ల ప్రభుత్వ వైద్యసేవలు ప్రజల చెంతకే చేరుతున్నాయి. ఈ కేంద్రాల్లో ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించటంతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నందున అనారోగ్యాలకు గురైన వారు ప్రైవేట్ ఆసుపత్రులను పక్కకు పెట్టి ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్నారు.మండల వ్యాప్తంగా సుమారు 60 వేల మంది జనాభా ఉండగా గతంలో మండల కేంద్రంలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. దాంతో దూర ప్రాంత గ్రామాల ప్రజలు చిన్న,చిన్న రోగాలకు స్థానికంగా ఉండే ప్రైవేట్ వైద్యులనే సంప్రదించేవారు. సింగరేణి మండలంలో చీమలపాడు, మాదారం, విశ్వనాథపల్లి, సీతారాంపురం, బస్వాపురం, గాంధీపురం, బీక్యాతండా, సూర్యతండా, భాగ్యనగర్‌తండా, మొట్లగూడెం, కొత్తకమలాపురం, ఉసిరికాయలపల్లిలో నూతన పల్లెదవాఖానలను నిర్మించిన ప్రభుత్వం కొత్తగా 5గురు వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించింది. వీటితో పాటు పలు గ్రామాల్లో సబ్‌సెంటర్లను కూడా ఏర్పాటు చేసింది. ఈ దవాఖానల్లో ప్రాథమిక చికిత్సలకు కావాల్సిన పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రతిరోజు వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో మండల పీహెచ్‌సీ పైన భారం తగ్గింది. అదే విధంగా ఇక్కడ పని చేస్తున్న వైద్యులు, స్టాప్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు కృషి చేస్తున్నారు.



సబ్‌సెంటర్‌లో పరీక్షిస్తున్న వైద్యాధికారి



సుఖప్రసవాలపై గర్భిణికి అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

### గ్రామాల్లో వైద్యసేవలు అందించటం గర్వంగా ఉంది..



గ్రామీణ ప్రాంత ప్రజలకు పల్లెదవాఖానాల ద్వారా వైద్యసేవలు అందించటం గర్వంగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లభిస్తుండడంతో ప్రజలు ప్రైవేట్ దవాఖానాలకు వెళ్లడం తగ్గిస్తున్నారు. అత్యవసర వైద్యసేవలు మినహాయించి ప్రాథమిక వైద్యం అంతా కూడా పల్లెదవాఖానల్లోనే అందిస్తున్నాం. గర్భిణులకు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

**- హిమబిందు, పల్లెదవాఖాన వైద్యురాలు, భీక్యాతండా సబ్‌సెంటర్**

### ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది ..



రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువచ్చి పెను మార్పుల వల్ల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం ఏర్పడింది. ఎటువంటి వైద్యసేవలు అవసరం ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రులకే వస్తున్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మండల వ్యాప్తంగా ఉన్న అసంక్రమిత వ్యాధిగ్రస్తుల ఆరోగ్య స్థితిగతులను క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారు.

**- బి.సురేశ్, మండల వైద్యాధికారి**